
సాక్షి గుంటూరు

శుక్రవారం । 18 । ఏప్రిల్ । 2025



అగ్ని ప్రమాదాలపై అవగాహన

నరసరావుపేట టౌన్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా నరసరావుపేట అగ్నిమాపక శాఖ అధికారి సుబ్బారావు ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు అవగాహన కల్పించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 515.00 అడుగుల వద్ద ఉంది. ఇది 140.3150 టీఎంసీలకు సమానం.



బీచ్ కబడ్డీ పోటీలకు స్థల పరిశీలన

మచిలీపట్నంరూరల్: మంగినపూడిబీచ్‌లో మేనెలలో జరగబోయే బీచ్ కబడ్డీ పోటీల నిర్వహణ కోసం అధికారులు, స్పోర్ట్స్ అథారిటీ బృందం గురువారం స్థల పరిశీలన చేశారు.

తొలగించింది కించెత్తే!

- మున్సిపల్ కంపోస్టు యార్డు వ్యర్థాల తొలగింపులో జాప్యం
- ఏప్రిల్ ఆఖరుకు ఖాళీ చేస్తామన్న అధికారుల హామీకి తూట్లు
- రెండునెలల్లో కేవలం 20 వేల టన్నులు మాత్రమే తొలగింపు
- యార్డులో ఇంకా 80 వేల టన్నులు



కంపోస్టు యార్డులో వ్యర్థాల తొలగింపు ప్రక్రియ

తెనాలి: బుర్రిపాలెం రోడ్డులోని మున్సిపల్ కంపోస్టు యార్డు ఖాళీ చేసే ప్రక్రియ పనులు నత్త నడక నడుస్తున్నాయి. రెండునెలలుగా 20 వేల టన్నుల వ్యర్థాలను మాత్రమే విభజన చేశారు. ఇంకా 80 వేల టన్నుల చెత్తనిల్వలు పేరుకు పోయి ఉన్నాయి. ఏప్రిల్ ఆఖరుకు యార్డు ఖాళీ చేస్తామన్న అధికారులు హామీ నెరవేరేలా కనిపించటం లేదు. ఎంతోకాలంగా ప్రజలు ఎదురుచూస్తున్న కంపోస్టు యార్డు సమస్యకు ఇప్పట్లో మోక్షం లభించేలా లేదని పెదవి విరుస్తున్నారు.

రోజుకు 80 టన్నుల చెత్త ఉత్పత్తి

తెనాలి పట్టణ జనాభా ఏటికేడాది విస్తరిస్తుండటం తెలిసిందే. జనాభా రెండు లక్షలకు చేరుకుంది. రోజురోజుకీ చెత్త పెరుగుతోంది. ప్రస్తుతం పట్టణంలో రోజుకు 80 టన్నుల చెత్త వస్తోంది. ఇందులో తడిచెత్త, పొడిచెత్త, ప్లాస్టిక్ సంచులు, ఎలక్ట్రానిక్ వస్తువులు ఉంటున్నాయి. రోజువారీ చెత్తను తగ్గించాలనే ఉద్దేశంతో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఇదే కంపోస్టుయార్డులో తడిచెత్త నుంచి వర్మీకంపోస్టు, బయోగ్యాస్ తయారీ యూనిట్లను నిర్వహిస్తున్నారు. ఇకపోతే మిగిలిన చెత్తంతా యార్డులో పేరుకుపోతోంది.

ప్రజలందరికీ కష్టాలే..!

కంపోస్టు యార్డు సమీపంలోని పంటపొలాలకు చెత్త సమస్యగా మారిందని సమీప రైతులు ఎప్పటి నుంచో ఫిర్యాదుచేస్తున్నారు. ఈ చెత్త వల్ల ప్రహరీలు పడిపోతుండటం మరో సమస్య. వీటికితోడు చెత్తనుంచి మిథైల్ గ్యాస్ విడుదలవుతూ, చెత్త దానికదే తగులబడుతోంది. వ్యర్థాల దగ్ధంతో రోజుల తరబడి హానికరమైన పొగలు చుట్టుపక్కల అరకిలోమీటరు వరకూ వ్యాపిస్తున్నాయి. ప్రజలు కళ్లు మండడంతోపాటు ఊపిరి పీల్చుకోవటానికి ఇబ్బంది పడుతున్నారు. ఆ దారిలోనే పలు విద్యాసంస్థలు, దాల్ మిల్లులు ఉన్నాయి. అతిదగ్గర్లోనే అపార్టుమెంట్లు, బీసీ కాలనీ ఉన్నాయి. కంపోస్టు యార్డు కారణంగా ఆయా ప్రాంతాల్లోని ప్రజలంతా బాధపడుతున్నారు. చెత్త తొలగించాలని కోరుతున్నారు.

పేరుకున్న లక్ష టన్నుల వ్యర్థాలు!

కంపోస్టు యార్డులోని వ్యర్థాల పరిమాణంపై 2022లో డ్రోన్‌తో సర్వే చేశారు. అప్పటికి 63,555 టన్నులు ఉన్నట్టు అంచనా వేశారు. గత రెండేళ్లలో మరో 35 వేల టన్నులు చేరి ఉంటుందన్నది అంచనా. మొత్తం లక్ష టన్నుల వ్యర్థాలు అన్నమాట. సమీప బుర్రిపాలెంకు చెందిన కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కంపోస్టుయార్డును అక్కడ్నుంచి తొలగించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. దీనిపై అధికారులు టెండర్లు పిలిచారు. ప్రస్తుతం టన్నుకు రూ.503 చొప్పున రూ.3.17 కోట్లకు టెండరు ఖరారైంది. అమృత్ నిధులు, మున్సిపల్ సాధారణ నిధుల నుంచి ఈ మొత్తాన్ని చెల్లిస్తారు. టెండరు దక్కించుకున్న హైదరాబాద్‌కు చెందిన సుధాకర ఇన్‌ఫ్రాటెక్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధునిక ట్రిమ్మెల్‌ను ఫిబ్రవరిలో ఇక్కడకు చేర్చింది. ముందుగా కూలీలను నియమించి చెత్తలోని పెద్ద టైర్లు, కర్రలు, రాళ్లను తొలగించేశారు. తర్వాత ట్రిమ్మెల్‌తో ప్లాస్టిక్, ఇతర చెత్త ఒకవైపు చేర్చుతుండగా, మరోవైపున మట్టి, ఇసుక, కంకర వంటివి గుట్టపోస్తున్నారు. మట్టిని కొందరు రైతులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు తమ వెంచర్లకు తీసుకు వెళుతున్నారు. ప్లాస్టిక్, ఇతర చెత్తను జిందాల్/సిమెంటు ఫ్యాక్టరీలకు తరలిస్తున్నారు. మరోవైపు రోజువారీ పట్టణంలోంచి వచ్చే చెత్తను ఇందులో చేర్చకుండా కంపోస్టు యార్డులోనే ప్రత్యేకంగా వేయిస్తున్నారు. మున్సిపల్ వాహనాల్లో ఆ చెత్తను జిందాల్‌కు పంపేస్తున్నారు.

24 గంటలు పనిచేసేలా ప్రణాళిక



కంపోస్టు యార్డు నుంచి వ్యర్థాల తొలగింపు పనుల వేగవంతానికి 24 గంటలు పనిచేసేలా ప్లాన్ చేస్తున్నాం. కాంట్రాక్టు ప్రకారం 63 వేల టన్నులు తొలగించాలి. తర్వాత మిగిలిపోయే దాదాపు 35 వేల టన్నుల వ్యర్థాల తొలగింపు విషయం తర్వాత ఆలోచిస్తాం. ఇదే కంపెనీకి ఇవ్వాలా? మళ్లీ టెండర్లు పిలవాలా? అనే దానిపై నిర్ణయం తీసుకుంటాం.

– ఆకుల శ్రీనివాసరావు, మున్సిపల్ ఇన్‌చార్జి ఇంజినీరు

తొలగించింది 20వేల టన్నులే..!

గత జనవరి 15 నుంచి అమల్లోకి వచ్చిన కాంట్రాక్టు గడువు జులై 15వ తేదీ నాటికి పూర్తవుతుంది. టెండరు పిలిచినపుడు 63 వేల టన్నుల తొలగింపునకు కాంట్రాక్టు ఇచ్చారు. ప్రస్తుతానికి ఇందులో మూడో వంతు అంటే 20 వేల టన్నులను మాత్రమే తీయగలిగారు. టెండరు ప్రకారం ఇంకా 43 వేల టన్నుల వ్యర్థాలున్నాయి. ఏప్రిల్ నాటికి యార్డు ఖాళీచేస్తామని మున్సిపల్ అధికారులు ప్రకటించారు. ఇలాగే పనులు కొనసాగితే జులై పూర్తయ్యేలోగానైనా వ్యర్థాల తొలగింపు జరుగుతుందనే నమ్మకం లేదు. కాంట్రాక్టు పూర్తయ్యాక ఇంకా తొలగించాల్సిన వ్యర్థాలు మరో 35 వేల టన్నులు ఉండిపోతాయి. మరి వాటి సంగతి ఏం చేస్తారనేది తెలియాల్సి ఉంది. మొత్తంమీద కంపోస్టు యార్డు కథ ఇప్పట్లో కంచికి చేరేలా కనిపించటం లేదు.

న్యూస్‌రీల్

అగ్నిప్రమాదాల నివారణపై మాక్‌డ్రిల్



గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతిరోడ్డులోని నెక్స్‌జెన్ ఇంటర్నేషనల్ స్కూల్లో గురువారం అగ్ని ప్రమాదాల నివారణపై మాక్ డ్రిల్ నిర్వహించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మాకి డ్రిల్‌కు రాష్ట్ర డిజాస్టర్ రెస్పాన్స్, ఫైర్ సర్వీసుల డైరెక్టర్ జనరల్ మాదిరెడ్డి ప్రతాప్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అగ్ని ప్రమాదాలను నివారించడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాదాలు సంభవించినప్పుడు సమయస్ఫూర్తితో వ్యవహరించి, ప్రాణాలను రక్షించే విధానాలను అగ్నిమాపక సిబ్బంది ప్రదర్శించారు. అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తలపై కరపత్రాలను మాదిరెడ్డి ప్రతాప్ విడుదల చేశారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించిన డీజీ ప్రతాప్ వారితో కలిసి ప్లకార్డులు ప్రదర్శించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు కె. శ్రీకాంత్‌బాబు, డాక్టర్ కె.శ్రీవిద్య, అగ్నిమాపక శాఖాధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటి నుంచి మిర్చి యార్డుకు వరుస సెలవులు

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం నుంచి వరుసగా మూడు రోజుల పాటు సెలవులు ప్రకటించారు. శుక్రవారం గుడ్‌ఫ్రైడే, శని, ఆదివారాలు సాధారణ సెలవులు ఇచ్చినట్టు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సెలవు రోజుల్లో రైతులు తమ సరుకును యార్డుకు తీసుకురావద్దని కోరారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి సరుకును యార్డులోకి అనుమతిస్తామని పేర్కొన్నారు. సోమవారం నుంచి యథావిధిగా క్రయవిక్రయాలు కొనసాగుతాయని వివరించారు.

1,58,818 బస్తాలు మిర్చి విక్రయం



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 1,39,333 బస్తాల మిర్చి రాగా గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,58,818 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.9,500 నుంచి రూ.13,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.9,800 నుంచి రూ.13,500 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.6,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 57,411 బస్తాలు నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక తెలిపారు.

నిలిచిన మట్టి తవ్వకాలు

సాక్షి ఎఫెక్ట్

తాడికొండ: తాడికొండ మండలం పాములపాడు గ్రామంలో తెలుగు తమ్ముళ్లు అక్రమంగా చేపట్టిన మట్టి తవ్వకాలకు ఎట్టకేలకు బ్రేక్ పడింది. గురువారం 'సాక్షి'లో కథనం ప్రచురితం కావడంతో అప్రమత్తమైన అధికారులు జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తవ్వకాలు నిలుపుదల చేయించారు. చెరువు బలోపేతం పేరుతో జరుగుతున్న దందాకు బ్రేక్ పడడంతో 'సాక్షి' చొరవను పలువురు గ్రామస్తులు అభినందించారు.

హనుమ ఆలయంలో అవినీతిపై అధికారులు సీరియస్!

సాక్షి ఎఫెక్ట్

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): గుంటూరు నాజ్ సెంటర్లోని ఆంజనేయ స్వామి ఆలయంలో జరుగుతున్న అవినీతి తంతుపై ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారు. 'సాక్షి' దినపత్రిక జిల్లా పేజీలో గురువారం హనుమా.. అవినీతి కనుమా శీర్షికన ప్రచురించిన కథనానికి దేవదాయ, ధర్మదాయ శాఖ అధికారులు స్పందించినట్టు తెలుస్తోంది. ఆలయ ఆదాయానికి గండి కొట్టేలా వ్యవహరిస్తున్న ఆలయ ప్రధాన అర్చకుడు, సిబ్బంది, ఆలయ దుకాణదారుడి అంశంపై విచారణ చేపట్టనున్నట్లు సమాచారం. దీనిపై దేవదాయశాఖ ఆర్జేసీ స్థాయి అధికారి విచారణ చేయనున్నారని ఆ శాఖ సిబ్బంది చెబుతున్నారు.

గ్రామాల్లో రెడ్ బుక్ రాజ్యాంగం అమలు

మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



వినుకొండ: గ్రామాల్లో రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలే లక్ష్యంగా దాడులు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పేర్కొన్నారు. బుధవారం ఈపూరు మండలం కొచ్చర్ల గ్రామంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై జరిగిన దాడిని ఆయన ఖండించారు. టీడీపీ నాయకుల దాడిలో గాయపడి ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్న లక్కిశెట్టి బుచ్చమ్మ, రాగాల భువనేశ్వరిలను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోని వచ్చిన తర్వాత ప్రతి గ్రామంలోనూ ఇలాంటి దాడులు జరుగుతున్నాయని అన్నారు. రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు పరుస్తూ పోలీసుల ద్వారానే అక్రమ కేసులు బనాయించడం, అర్ధరాత్రి అరెస్టులు చేయడం, బెదిరించడం వంటి కార్యక్రమాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అవసరమైతే న్యాయపోరాటం చేస్తామని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ప్రోద్బలంతోనే గ్రామాల్లో ఇలాంటి దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ దాడులకు ఎవరూ భయపడరని, ఎదురు తిరిగే రోజు వస్తుందన్నారు. మహిళలని కూడా చూడకుండా దాడి చేసి కాలు విరగ్గొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంతకన్నా దారుణం ఎక్కడుందని కూటమి పాలకులను నిలదీశారు. చిన్న గొడవలు జరిగినా హత్యాయత్నం కేసులు నమోదు చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నట్లు చెప్పారు. టీడీపీ కార్యకర్తలకు ఎలాంటి దెబ్బలు తగలకపోయినా 307 కేసు నమోదు చేయడం ఏంటని ప్రశ్నించారు. ఈ దాడులను ఖండించాల్సింది పోయి ప్రోత్సహించడం ఎమ్మెల్యేకు తగదని హితవు పలికారు. మాజీ ఎమ్మెల్యే వెంట పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

గురుశిష్యుల అనుబంధం వెలకట్టలేనిది



సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ బాలలతను అభినందిస్తున్న విద్యార్థులు

సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ బాలలత

ఏఎన్‌యూ(గుంటూరు): గురుశిష్యుల అనుబంధం వెలకట్టలేనిదని హైదరాబాద్‌లోని సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ ఎం.బాలలత అన్నారు. వర్సిటీలో గురువారం జరిగిన వార్షికోత్సవంలో ఆమె ముఖ్యఅతిథిగా మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత విలువలతో సమాజంలో బాధ్యతాయుతంగా ఆదర్శవంత జీవనాన్ని సాగించాలన్నారు. ప్రతిభతోపాటు స్థిరత్వం ముఖ్యమని సూచించారు. వ్యక్తి తలుచుకుంటే ఒక వ్యవస్థగా మారి, ఒక గొప్పశక్తి కాగలడని పేర్కొన్నారు. గౌరవ అతిథిగా ముఖ్యమంత్రి కార్యాలయ రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ అధికారి చిటికెల చిన్నారావు మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగాలని సూచించారు. ఏఎన్‌యూ వీసీ ఆచార్య కె.గంగాధరరావు మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక విజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని, కృత్రిమ మేధ ప్రాముఖ్యాన్ని తెలుసుకోవాలని చెప్పారు. వార్షికోత్సవానికి ఏఎన్‌యూ ఆర్ట్స్, కామర్స్, లా కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎం.సురేష్ కుమార్ అధ్యక్షత వహించారు. తర్వాత బాలలతను సత్కరించారు. అనంతరం రెక్టార్ ఆచార్య కె.రత్నషీలా మణి, వీసీ కె.గంగాధరరావుతోపాటు పలువురిని సన్మానించారు. రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డు పొందిన వర్సిటీ ప్రొఫెసర్లు ఎం.త్రిమూర్తిరావు, వై.అశోక్ కుమార్, ఎన్.వి.కృష్ణారావు, పూర్ణచంద్రరావులను వర్సిటీ వీసీ రెక్టార్ రిజిస్ట్రార్, ఓఎస్‌డీ తదితరులు సత్కరించారు. కార్యక్రమానికి ఎం.త్రిమూర్తిరావు, సీహెచ్ లింగరాజు, డాక్టర్ రవి శంకర్ రెడ్డి కన్వీనర్లుగా వ్యవహరించారు. కార్యక్రమంలో పూర్వ ఐఏఎస్ అధికారి ఆంధ్రప్రదేశ్ దూరదర్శన్ విభాగాధిపతి డాక్టర్ జి.కొండలరావు, సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ వీరయ్య, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ ప్రమీల రాణి పాల్గొన్నారు. అనంతరం దివ్యాంగ కళాకార స్వర నేత్ర బృందం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. జానపద గాయకులు దామోదర గణపతిరావు బృందం పలు గీతాలను ఆలపించింది. సినీ గాయకురాలు సాయి శిల్ప గీతాలాపనతో అలరించారు. వర్సిటీలోని డ్యాన్స్ విభాగం విద్యార్థులు నృత్యాలతో ఆహూతులను ఆకట్టుకున్నారు. పోటీల్లో విజేతలైన విద్యార్థులకు, బృందాలకు అతిథులు బహుమతి ప్రదానం చేశారు.

యోగా టీచర్లకు జీతాలు చెల్లించాలి

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): ఏపీలోని సుమారు 800 ఉన్నత పాఠశాలల్లో విధులు నిర్వర్తించే యోగా ఇన్‌స్ట్రక్టర్స్, సహాయకులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ వలి డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో గురువారం యోగా టీచర్లు పోలీస్ కార్యాలయం (డీపీఓ) వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వలి మీడియాతో మాట్లాడుతూ సుమారు 1,700 మంది నిరుద్యోగులకు రావాల్సిన రూ.40 కోట్లకుపైగా యోగా ఫౌండేషన్ మోసం చేసిందని ఆరోపించారు. ఫౌండేషన్ నిర్వాహకుడిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో యోగా ఉపాధ్యాయులను నియమించాలని గతంలో అధికారులు ఆదేశాలు ఇచ్చారని, ఈ క్రమంలో గుంటూరు జిల్లాలోని ఓ యోగా హెల్త్ ఫౌండేషన్‌కు బాధ్యతలు అప్పగించారని పేర్కొన్నారు. దీంతో కొందరు నిరుద్యోగులకు రెండు నెలలు యోగాలో తర్ఫీదిచ్చారని పేర్కొన్నారు. అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో విధులు నిర్వర్తించేలా ఆదేశాలిచ్చారని గుర్తుచేశారు. ప్రతి నెలా రూ.35 వేలు జీతం చెల్లిస్తామని చెప్పి, ఇప్పటికి ఫౌండేషన్ నిర్వాహకులు జీతాలు సక్రమంగా చెల్లించలేదని ఆరోపించారు. జీతాలు చెల్లింపులు, ఉద్యోగ రక్షణతోపాటు ఫౌండేషన్ నిర్వాహకుల నుంచి రక్షణ కల్పించాలని యోగా టీచర్లు కోరారు. అనంతరం ఎస్పీ సతీష్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మస్తాన్‌రావు, రెహ్మాన్, అల్లాబక్షు, సుభాని, బాధితులు సునీత, గొల్ల బాబ్జి, సంతోష్, అరుణ, విమల పాల్గొన్నారు.



జిల్లా పోలీస్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న దృశ్యం

జై చెన్నకేశవ.. జై జై చెన్నకేశవ..

- కనుల పండువగా శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి రథోత్సవం
- వేడుక ఆద్యంతం పులకించిన భక్త జనసందోహం

మాచర్ల రూరల్: పల్నాడు ప్రజల ఆరాధ్య దైవం, భక్తుల కొంగుబంగారంగా పిలుచుకునే శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం రథోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. వేలాది తరలివచ్చిన భక్తజన సందోహంతో కనుల పండువగా వేడుక జరిగింది. తొలుత శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామి వార్ల ఉత్సవ విగ్రహాలను ఆలయం నుంచి రథంపైకి చేర్చారు. కుమ్మరి వారు కుంభం పోసి హారతి ఇచ్చి రథం ఊరేగింపునకు సిద్ధం చేశారు. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి – శోభారాణి దంపతులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి రథం ఊరేగింపును ప్రారంభించారు. రథంపై నగారా మోగిస్తూ జై చెన్నకేశవ.. అంటూ భక్తులు రథాన్ని పురవీధుల్లో లాగేందుకు పోటీ పడ్డారు. రథశాల నుంచి లక్ష్మీదేవి మిద్దెల మీదుగా బురుజు సెంటర్ వరకు జై చెన్నకేశవ, జై జై చెన్నకేశవ.. నినాదాలు మార్మోగాయి. గోవింద నామ స్మరణతో రథోత్సవం అత్యంత వైభవంగా కొనసాగింది. ఆలయ ప్రధాన అర్చకులు అడిగొప్పల రాజగోపాలాచార్యులు శాస్త్రోక్తంగా స్వామి వారికి పూజ నిర్వహించారు. ఈఓ పూర్ణచంద్రరావు పర్యవేక్షణలో వేడుక సాగింది. రథోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పల్నాటి ప్రాంతం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా వేల సంఖ్యలో తరలి వచ్చారు. స్వామిని దర్శించుకుని భక్తి పారవశ్యంతో పులకించిపోయారు. స్వచ్ఛంద సేవా సంస్థలు భక్తులకు మజ్జిగ, పులిహోర, పానకం, కూరగాయల మార్కెట్‌లో అన్నదాన కార్యక్రమాలను నిర్వహించాయి. అడిషనల్ ఎస్పీ జె.సంతోష్, సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావుల నేతృత్వంలో పట్టణ సీఐ పచ్చిపాల ప్రభాకర్‌రావు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.



శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి రథం ఊరేగింపులో పాల్గొన్న భక్త జన సందోహం

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు

గుంటూరు వెస్ట్: అమరావతి రాజధాని పరిధిలో భారీ నిర్మాణాలు, అభివృద్ధి కార్యక్రమాలు జరగనున్న దృష్ట్యా అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని జిల్లా ప్రత్యేక అధికారి, సీఆర్డీఏ కమిషనర్ కె.కన్నబాబు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ శంకరన్ సమావేశ మందిరంలో కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ, జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి నిర్వహించిన సమన్వయ కమిటీ సమావేశంలో కన్నబాబు మాట్లాడుతూ సచివాలయం, విభాగాధిపతుల కార్యాలయాలు, ఇతర అంశాలు పునఃప్రారంభం కానున్న దృష్ట్యా అధికారులు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్లాలన్నారు. నిర్మాణాలకు వచ్చే కార్మికులకు భద్రత ఏర్పాట్లు చేపట్టాలన్నారు. అసాంఘిక శక్తుల నుంచి కార్మికులకు రక్షణ కల్పించేలా పోలీసు శాఖ చర్యలు తీసుకోవాలన్నారు. నిర్మాణ రంగంలో ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించడంతోపాటు, అనుకోని ఘటనలు జరిగినప్పుడు వైద్యులు, అంబులెన్సులు, మందులను ముందుగానే అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. రాజధాని పరిధిలో పీహెచ్‌సీని ఇప్పటికే 30 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేశామని పేర్కొన్నారు. కార్మికులకు అవసరమైన చికిత్స అక్కడ చాలా వరకు అందుబాటులో ఉంటుందన్నారు. నిర్మాణ పనులకు కార్మికులు కుటుంబ సభ్యులతో వస్తారు కనుక, చదువుకునే పిల్లలను స్కూల్స్, అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని పేర్కొన్నారు. కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి మాట్లాడుతూ రాజధానిలో భారీ నిర్మాణాలతో చాలా మందికి ఉపాధి అవకాశాలు మెరుగవుతాయన్నారు. అయితే వారి రక్షణకు కూడా ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొన్నారు. రాజధాని పరిధిలో శాంతి భద్రతలు చక్కగా ఉండేలా పోలీసు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. కార్మికులకు చట్టపరంగా అందించాల్సిన సౌకర్యాలపై కార్మిక శాఖ దృష్టి పెట్టాలన్నారు. నిర్మాణ పరిసర ప్రాంతాల్లో శానిటేషన్ ఇబ్బందులు తలెత్తకుండదని కలెక్టర్ వివరించారు. కార్యక్రమంలో డీఆర్వో షేక్ ఖాజావలి, జెడ్పీ సీఈఓ జ్యోతిబసు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి, డీపీఓ నాగసాయికుమార్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఆర్డీఏ కమిషనర్

ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు కృషి

ప్రతి నియోజకవర్గంలోనూ ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు కృషి చేస్తున్నట్టు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో కలెక్టర్, ఎస్పీ సతీష్ కుమార్, జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ, జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు పాల్గొన్నారు. కలెక్టర్ వర్చువల్‌గా మాట్లాడుతూ జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈల ఏర్పాటుకు భూములను గుర్తించామని పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర, ఈ–వేస్ట్ కార్యక్రమాన్ని ప్రతి నెలా మూడో శనివారం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ప్రభుత్వ కార్యాలయాల్లో నిరుపయోగంగా ఉన్న ఎలక్ట్రానిక్ వ్యర్థాలను నగరపాలక సంస్థతో అనుసంధానమైన ఏజెన్సీకి అందిస్తున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో డీఆర్వో షేక్ ఖాజావలి, జడ్పీ సీఈఓ జ్యోతి బసు, డీపీఓ సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు



గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో గురువారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 5,500 గరిష్ఠం : రూ. 8,500

మోడల్ ధర రూ. 7,200

క్లుప్తంగా

పసుపు ధరలు

దుగ్గిరాల: దుగ్గిరాల పసుపు యార్డుకు 896 బస్తాలు వచ్చాయి. పసుపు మొత్తం అమ్మకం చేసినట్లు వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యదర్శి ఎస్.శ్రీనివాసరరావు ఒక ప్రకటనలో తెలిపారు. కొమ్ములు 604 బస్తాలు వచ్చాయని, వాటి కనిష్ఠ ధర రూ.11,161, గరిష్ఠ ధర రూ.12,275, మోడల్ ధర రూ.11,851 పలికినట్టు వివరించారు. కాయలు 292, బస్తాలు వచ్చాయని, కనిష్ఠ ధర రూ.10,800, గరిష్ఠ ధర రూ.12,311, మోడల్ ధర రూ.11,851 పలికినట్టు వెల్లడించారు. మొత్తం 672 క్వింటాళ్ల అమ్మకాలు జరిగినట్లు వివరించారు.

రేపు చలో కొవ్వూరు

నెహ్రూనగర్: ఈనెల 19న పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి చెందిన ప్రాంతంలో క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించనున్నట్లు క్రైస్తవ సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు మెల్లెల రాజు తెలిపారు. శుక్రవారం నగరంపాలెంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ ఎంపీ హర్ష కుమార్ పిలుపు మేరకు కొవ్వొత్తులతో శాంతి ప్రదర్శన చేపడుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమాన్ని క్రైస్తవ సంఘాల నాయకులు జయప్రదం చేయాలని కోరారు.

తప్పిన ప్రమాదం

జాతీయ రహదారిపై ఆగి ఉన్న ఆటోను ఢీకొట్టిన మినీ లారీ



చీరాల: జాతీయ రహదారిపై పెనుప్రమాదం తప్పింది. గురువారం చిన్నగంజాం నుంచి చెరుకుపల్లి మండలం పొన్నపల్లికి కుటుంబంతో కలసి ఆటోలో వెళుతుండగా చీరాలలోని జాతీయ రహదారిలో టీడీపీ కార్యాలయం వద్ద నీరు తాగేందుకు ఆటో నిలిపారు. అదే మార్గంలో వేరుశనగ లోడుతో వస్తున్న మినీ లారీ రోడ్డు పక్కన ఆగి ఉన్న ఆటోను ఢీ కొట్టింది. దీంతో అటో వేగంగా పక్కనే ఉన్న పంట కాలువలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న నలుగురు పెద్దలు, ఇద్దరు చిన్నారులకు గాయాలయ్యాయి. ఈ ఘటనలో అందరూ ప్రాణాలతో బయటపడడంతో పెను ప్రమాదం తప్పింది. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.దువ్వల్లో విషాదం నెలకొంది.

ఒడిశా టు ఆంధ్రా గంజాయి రవాణా

- తాడేపల్లి పోలీసులకు పట్టుబడిన నలుగురు యువకులు
- నిందితుల్లో అంతర్జాతీయ స్విమ్మర్!



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ మురళీకృష్ణ

తాడేపల్లి రూరల్ : ఒడిశా నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాలకు గంజాయి సరఫరా అవుతోందని రుజువైంది. తాజాగా గురువారం తాడేపల్లి పోలీసులు నలుగురిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి జైలుకు తరలించారు. ఈ కేసు వివరాలను నార్త్‌జోన్ డీఎస్పీ మురళీకృష్ణ విలేకరులకు వెల్లడించారు. అయన కథనం ప్రకారం.. తాడేపల్లి కృష్ణాకెనాల్ జంక్షన్ వద్ద కొందరు గంజాయి తాగుతున్నారన్న సమాచారం రావడంతో తాడేపల్లి సీఐ కల్యాణ్‌రాజు, ఇతర సిబ్బంది నిఘా పెట్టారు. పక్కా పథకం ప్రకారం.. గంజాయి తాగుతున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నాలుగు కేజీల గంజాయి లభ్యమైంది. పాత ఈఎస్ఐ హాస్పిటల్ వద్ద వార్పునకు చెందిన పీతా దినేష్ కుమార్, పోలకంపాడుకు చెందిన కోడె సూర్యగణేష్, ఉండవల్లికి చెందిన మల్లిశెట్టి అనీల్, పెనుమాకకు చెందిన కళ్ళం అనీల్‌రెడ్డి పోలీసుల అదుపులో ఉన్నారు. వీరు ఒడిశాలోని బరంపురంలో గంజాయి కొని అక్కడి నుంచి రైలు ద్వారా తాడేపల్లికి తీసుకువచ్చి అమ్మకాలు సాగిస్తున్నట్టు నిర్ధారణైంది. ఈ నలుగురిలో పీతా దినేష్‌కుమార్‌పై కృష్ణాజిల్లాలో ఓ గంజాయి కేసు



పోలీసులు పట్టుకున్న గంజాయి

నమోదై ఉంది. మిగిలిన ముగ్గురు తొలిసారి పట్టుబడ్డారు. వీరు డబ్బులు అవసరమైనప్పుడు ద్విచక్ర వాహనాలు తాకట్టు పెట్టి వచ్చిన డబ్బుతో ఒడిశా వెళ్లి గంజాయి కొని తీసుకువచ్చి ఎక్కువ ధరకు అమ్ముతుంటారని పోలీసుల దర్యాప్తులో తేలింది.

గంజాయికి అలవాటు పడిన అంతర్జాతీయ స్విమ్మర్

నిందితుల్లో మల్లిశెట్టి అనీల్ అంతర్జాతీయ స్విమ్మర్ అని, అతనూ గంజాయికి అలవాటు పడడం ఆశ్చర్యానికి గురిచేస్తోందని డీఎస్పీ తెలిపారు. వ్యాయామాలపై అవగాహన కలిగిన క్రీడాకారులూ వ్యసనాలకు అలవాటు పడడంపై ఆందోళన వ్యక్తమవుతోంది. కేసులో ప్రతిభ కనబర్చిన తాడేపల్లి సీఐ కల్యాణ్‌రాజు, సిబ్బందిని ఎస్పీ సతీష్‌కుమార్ అభినందించారని డీఎస్పీ వెల్లడించారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవులు ఇవ్వాలి

ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ప్రతినిధుల వినతి



మహిళా శిశు సంక్షేమ శాఖ కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): ఎండ తీవ్రత దృష్ట్యా మే నెల అంతా అంగన్‌వాడీ కేంద్రాలకు వేసవి సెలవులు ఇవ్వాలని, మినీ అంగన్‌వాడీ టీచర్లందరికీ మెయిన్ అంగన్‌వాడీ టీచర్లుగా ఉద్యోగోన్నతి కల్పించాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఒ.లలిత, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్.సారమ్మ కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక అమరావతి రోడ్డులోని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. అంగన్‌వాడీల సమస్యలను విన్నవించారు. వృత్తిపరమైన ఇబ్బందులను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు వాణిశ్రీ, అరుణ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉంటే మే 20న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొంటున్నట్టు యూనియన్ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు నోటీసు కూడా కమిషనర్‌కు అందించినట్టు వివరించారు. సమస్యలపై కమిషనర్ సానుకూలంగా స్పందించినట్టు చెప్పారు.

స్వర్ణాంధ్ర నాటకోత్సవాలు ప్రారంభం



జ్యోతిప్రజ్వలనతో నాటకోత్సవాలు ప్రారంభం



శ్రీకృష్ణ తులాభారం నాటకంలో ఓ సన్నివేశం

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): బృందావన్‌గార్డెన్స్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం అన్నమయ్య కళావేదికపై ఏపీ ప్రభుత్వ సృజనాత్మకత, సంస్కృతీ సమితి, భాష సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శ్రీ టీవీ, కళాంజలి క్రియేషన్స్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం స్వర్ణాంధ్ర నాటకోత్సవాలు మొదలయ్యాయి. ఆలయ పాలక మండలి ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి పుట్ట గుంట ప్రభాకరరావు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి, ఏపీ నాటక అకాడమీ నిర్వాహకులు గుమ్మడి గోపాలకృష్ణ, హంస అవార్డు గ్రహీత కావూరి సత్యనారాయణ, ఉగాది పురస్కార గ్రహీత నల్లక శ్రీనివాసరావు, టీవీ నటుడు, నిర్మాత డాక్టర్ వలేటి అప్పారావు ప్రసంగించారు. శనివారం వరకు స్వర్ణాంధ్ర నాటకోత్సవాలు జరుగుతాయని కళారత్న డాక్టర్ చిట్టినేని లక్ష్మీనారాయణ తెలిపారు. అనంతరం శ్రీదుర్గా భవాని నాట్యమండలి (తెనాలి) ఆధ్వర్యంలో ఆరాధ్యుల ఆదినారాయణరావు నిర్వహణలో శ్రీకృష్ణ తులాభారం, పౌరాణిక పద్య నాటకం ప్రదర్శించారు. నటీనటులు వారి పాత్రల్లో పౌరాణిక పద్యాలతో నాటక అభిమానులను మెప్పించారు. డోలక్‌పై సాంబిరెడ్డి చక్కటి సహకారాన్ని అందించారు.

రైతుల దుస్థితిని కళ్లకు కట్టిన ‘అన్నదాత’



అన్నదాత నాటికలో సన్నివేశం

తెనాలి: డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి స్మారక నాటక కళాపరిషత్, తెనాలి ఆధ్వర్యంలో ఇక్కడి రామలింగేశ్వరపేటలోని ఓపెన్ ఆడిటోరియంలో జరుగుతున్న జాతీయస్థాయి చతుర్థ ఆహ్వాన నాటికల పోటీల్లో భాగంగా ఆరో రోజైన గురువారం రెండు నాటికలను ప్రదర్శించారు. తొలుత కళాంజలి, హైదరాబాద్ వారి అన్నదాత నాటికను ప్రదర్శించారు. నేటి సమాజంలో రైతుల పరిస్థితిని కళ్లకు కట్టిందీ నాటిక. అప్పుల్లో కూరుకుపోతున్న రైతులు ప్రత్యామ్నాయ మార్గాలను వెతుక్కుంటున్న వర్తమాన స్థితిని ఎత్తిచూపింది. రైతాంగం మనుగడ ప్రశ్నార్థకం కావటం వ్యవసాయాధారిత దేశంలో ఓ గొప్ప విషాదంగా వర్ణించిందీ నాటిక. వల్లూరు శివప్రసాద్ రచించిన ఈ నాటికను కొల్లా రాధాకృష్ణ దర్శకత్వంలో ప్రదర్శించారు. వివిధ పాత్రల్లో శోభారాణి, సురభి ప్రియాంక, భుజంగరావు, పున్నయ్యచౌదరి, రాధాకృష్ణ, తిరుమల, శివరాం, ప్రశాంత్ నటించారు.

వినోదాన్ని పంచిన ‘వర్క్ ఫ్రమ్ హోమ్’..

అనంతరం సహృదయ, ద్రోణాదుల వారి ‘వర్క్ ఫ్రమ్ హోమ్’ నాటికను ప్రదర్శించారు. నలభీముడిలా వంటల చేయగల దిట్ట అయిన సుధీర్ సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా చేస్తూ వర్క్ ఫ్రమ్ హోమ్‌లో అటు వృత్తిపని, ఇంట్లోకి తరచూ వచ్చే చుట్టాలకు వంటలు చేస్తూ సతమతమైన వ్యవహారాన్ని ఆద్యంతం హాస్య సన్నివేశాలకు వినోదాత్మకంగా సాగిందీ నాటిక. చివరకు ఉద్యోగానికి రిజైన్ చూసి ‘సౌమ్యలక్ష్మీ హోమ్ ఫుడ్స్’ పేరుతో స్టార్టప్‌ను ప్రారంభిస్తాడు. కేకే భాగ్యశ్రీ మూలకథను అద్దేపల్లి భరత్‌కుమార్ నాటకీకరించగా, డి.మహేంద్ర దర్శకత్వం వహించి, ప్రధాన పాత్రలో నటించారు. ఇతర పాత్రల్లో కొత్త శివరాంప్రసాద్, ఆళ్ల హరిబాబు, షేక్ షఫీ ఉజ్మా, వి.నాగేశ్వరరావు, లహరి నటించారు. తొలుత యనమదల రీతిక శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శన ఆహుతుల అభినందనలు అందుకుంది. తెనాలి కళాకారుల సంఘం నిర్వహణలో జరుగుతున్న ఈ నాటికల పోటీలను గౌరవాధ్యక్షుడు ఆరాధ్యుల కన్నా, అధ్యక్షుడు అద్దేపల్లి లక్ష్మణశాస్త్రి, కార్యదర్శి పిట్టు వెంకట కోటేశ్వరరావు పర్యవేక్షించారు.

చట్టబద్ధంగా రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలి



అమరావతి: పల్నాడు జిల్లాలోని అమరావతి – బెల్లంకొండ రోడ్డు విస్తరణ పనులు ఇటీవల రెండు నెలలుగా ధరణికోట, అమరావతి పరిధిలోని గ్రామాలలో చేపట్టారు. పలువురు గ్రామస్తులు అభ్యంతరం తెలిపినా ఆర్ అండ్ బీ అధికారులు ఇష్టారాజ్యంగా నోటీసులు, నష్ట పరిహారాన్ని ఇవ్వకుండానే భవనాలను, ఇళ్లను కూలుస్తున్నారు. కట్టా రాధికాదేవి సహా మరికొందరు అధికారుల వైఖరిపై హైకోర్టును ఆశ్రయించారు. ప్రక్రియను చట్టబద్ధంగా కొనసాగించాలని కోరుతూ పిటిషనర్ల తరపున న్యాయవాది కోడె రమేష్ బుధవారం రిట్ పిటిషన్ దాఖలు చేశారు. విచారించిన హైకోర్టు న్యాయమూర్తి సత్తి సుబ్బారెడ్డి... ఆర్ అండ్ బీ శాఖ చట్టబద్ధంగా సర్వే నిర్వహించి, సంబంధికులకు నోటీసులు జారీ చేయాలన్నారు. చట్ట ప్రకారం ప్రక్రియను అనుసరించాలని ఆదేశాలు జారీ చేశారు. కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వ న్యాయవాది బాలాజీని హైకోర్టు ఆదేశించింది. దీనిపై పలువురు ఇళ్ల యజమానులు హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు చట్టబద్ధంగా వ్యవహరించాలని కోరారు. లేకుంటే పనులను అడ్డుకుంటామని హెచ్చరించారు.

ఆర్టీసీలో నిలిచిపోయిన ప్రమోషన్లు వెంటనే ఇవ్వాలి



చీరాల అర్బన్: ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు రకాల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఎన్ఎంయూ ఆధ్వర్యంలో గురువారం ఆర్టీసీ బస్టాండ్ వద్ద ప్లకార్డులతో నిరసన చేపట్టారు. డిపో అధ్యక్ష, కార్యదర్శులు ఎం.రవిబాబు, పి.దయాబాబులు మాట్లాడుతూ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలన్నారు. అలానే ఉద్యోగుల అవసరాన్ని బట్టి ఈఓఎల్‌లు మంజూరు చేయాలని, ఈహెచ్ఎస్ స్థానంలో పాత వైద్యవిధానాన్ని పునరుద్ధరించాలన్నారు. ఉద్యోగులకు అనారోగ్య సెలవులకు పూర్తి జీతం చెల్లించాలని, నాలుగు సంవత్సరాలుగా ఆగిపోయిన ప్రమోషన్లు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. 114 జీవోలో పొందుపరచిన మేరకు నైట్ అవుట్ అలవెన్సులను రూ.150 నుంచి రూ.400 వరకు చెల్లింపులు చేయాలన్నారు. సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళనలు తీవ్రతరం చేస్తామన్నారు. కార్యక్రమంలో సీసీఎస్ డెలిగేట్ డి.ప్రవీణ్‌కుమార్, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

చీరాల కేంద్రంగా గోవా మద్యం

చీరాల: చీరాల కేంద్రంగా గోవా మద్యం విక్రయాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయి. రైళ్లలో గోవా నుంచి చీరాల వాడరేవు, తీర ప్రాంతాలకు తరలించి రిసార్టులకు విక్రయిస్తున్నారు. ఇది చాలా కాలంగా కొనసాగుతూనే ఉంది. గురువారం సమాచారం అందుకున్న ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎక్సైజ్ పోలీసులు, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా గోవా మద్యం నిల్వ ఉంచిన స్థావరాలపై దాడులు నిర్వహించారు. వాడరేవు వైఎస్సార్ కాలనీకి చెందిన ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకున్న పోలీసులు అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.55 వేలు విలువ చేసే 550 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులిద్దరిని కోర్టుకు హాజరు పరచగా న్యాయమూర్తి వారికి రిమాండ్ విధించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏసీ విజయ మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా నాన్ డ్యూటీ మద్యంను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇలా తరచూ మద్యం తరలించిన వారిపై కఠినమైన చట్టాలను ఉపయోగిస్తామన్నారు. దాడులలో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఒంగోలు సీఐ రామారావు, చీరాల ఎక్సైజ్ సీఐ పి.నాగేశ్వరరావు, ఎస్సైలు బి.శ్రీహరి, రమాదేవి, రాజేంద్రప్రసాద్, టూటౌన్ ఏఎస్సై టి.వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

గోవుల మృతిపై విచారణ చేపట్టాలి



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

చినకాకాని(మంగళగిరి): తిరుపతిలో గోవుల మృత్యువాతపై ప్రభుత్వం విచారణ చేపట్టి నిజాలు నిగ్గుతేల్చాల్సిందిపోయి మతాల మధ్య చిచ్చు పెట్టి రాజకీయ మంటలు సృష్టిస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ధ్వజమెత్తారు. చినకాకానిలో జరుగుతున్న జనసేవాదళ్ శిక్షణ తరగతులకు హాజరైన రామకృష్ణ మాట్లాడుతూ తిరుపతిలో లడ్డూ కల్తీ అయిందని చెప్పిన ప్రభుత్వం ఇంతవరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అర్థంపర్థం లేని వ్యాఖ్యలతో మతాల మధ్య చిచ్చుపెడుతున్నారని రామకృష్ణ మండిపడ్డారు. కేంద్రంలో ప్రధానిగా ఉన్న మోదీ 11 ఏళ్లలో హిందువులకు ఏం చేశారని ప్రశ్నించారు. మోదీ అధికారంలోకి వచ్చాక రూపాయి విలువ పడిపోయిందని విమర్శించారు. ప్రధాని అదానీ, అంబానీలకు దోచి పెట్టడమే పనిగా పెట్టుకున్నారని ధ్వజమెత్తారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ మాట్లాడుతూ మోదీ పాలనలో మహిళలపై దాడులు, లైంగిక దాడులు పెరిగిపోయాయన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు జంగాల అజయ్‌కుమార్, చిన్ని తిరుపతయ్య, జాలాది జాన్‌బాబు, గని, ఆరేటి రామరావు పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితుడి అరెస్ట్

తెనాలి రూరల్: బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈనెల 14న తెనాలి–బుర్రిపాలెం రోడ్డులో బాలిక సైకిల్‌పై వెళుతుండగా గుర్తు తెలియని వ్యక్తి అటకాయించాడు. బాలికను ఎత్తుకుని పొలాల్లోకి తీసుకెళుతుండగా ఆమె కేకలు వేసింది. పరిసరాల్లో ఉన్నవారు అక్కడికి చేరుకుని బాలికను రక్షించారు. రూరల్ ఎస్ఐ కె.ఆనంద్ పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి నిందితుడిని దుగ్గిరాలకు చెందిన బక్కెన రవిబాబుగా గుర్తించారు. తెనాలి రైల్వేస్టేషన్ వద్ద ఉన్న అతన్ని గురువారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు.

బాలికపై లైంగిదాడి

తాడికొండ: బాలికపై యువకుడు లైంగిక దాడికి పాల్పడిన ఘటనలో పోక్సో కేసు నమోదు చేసినట్లు తాడికొండ సీఐ వాసు తెలిపారు. వివరాల ప్రకారం తాడికొండకు చెందిన బాలిక ఈనెల 15న ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో గ్రామానికి చెందిన శ్రీకాంత్ ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని బాలిక తల్లిదండ్రులకు తెలియజేయడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వాసు తెలిపారు.

స్థలం వివాదంలో ముద్దాయిలకు జరిమానా, జైలు

అద్దంకిరూరల్: స్థల వివాదంలో ఆరుగురు ముద్దాయిలకు ఎఎస్‌జే కోర్టు జడ్జి జరిమానా, శిక్ష విధించినట్లు సీఐ సుబ్బరాజు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివరాలు.. అద్దంకి మండలం మైలవరం గ్రామంలో 2020లో జరిగిన స్థల వివాదంలో అప్పటి ఎస్సై వీ.మహేష్ మన్నేపల్లి వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసు రిజిస్టర్ చేసి కోర్టులో ఫైల్ చేశారు. విచారణలో భాగంగా ముద్దాయిలైన ఉడుములపల్లి సోమయ్య, కొండనాగరాజు, కుడుములపల్లి పెదకోటయ్య, కుడుములపల్లి శ్రీనివాసరావు, కుడుములపల్లి కోటయ్య, కొండా చిరంజీవిలపై కేసు నిరూపణ కాగా గురువారం అద్దంకి ఎఎస్‌జే కోర్టు జడ్జి డీ. నాగ వెంకటలక్ష్మి ఒక్కొక్కరికి రూ.5వేలు జరిమానా, ఒక సంవత్సరం జైలు శిక్ష విధించారు.

చీరాలలో డ్రోన్‌లతో నిఘా



చీరాల: చీరాల పట్టణంలో అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నట్లు ఒన్‌టౌన్ సీఐ ఎస్.సుబ్బారావు తెలిపారు. గురువారం రాత్రి పట్టణంలోని ప్రధాన ప్రాంతాలలో డ్రోన్‌ల ద్వారా నిఘా ఏర్పాటు చేశారు. నిర్మానుష్య ప్రదేశాలు, బహిరంగ ప్రదేశాల్లో గంజాయి, మద్యం సేవిస్తున్న వారిని గుర్తించి చర్యలు తీసుకునే దిశగా నిఘాను మరింత కఠినతరం చేశారు. శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రజల సహకారం ద్వారా చీరాలలో శాంతి భద్రతలను మరింత బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టూటౌన్ సీఐ నాగభూషణం, పోలీసు సిబ్బంది ఈ ప్రత్యేక నిఘా కార్యక్రమాన్ని నిర్వహించారు.

యువకుడి మృతిపై అనుమానం ఉంది

డీజీపీ హరీష్‌కుమార్ గుప్తాకు వినతిపత్రం

తాడేపల్లి రూరల్: పల్నాడు జిల్లా నడికుడిలో రైలు కింద పడి మృతి చెందిన నంద్యాల జిల్లా దొర్నిపాడు మండలం, క్రిష్టపాడు గ్రామానికి చెందిన గడ్డం ప్రవీణ్‌కుమార్(28)ది ఆత్మహత్య కాదని, ఏదో కుట్రకోణం దాగి ఉందని జాతీయ మానవ హక్కుల సంఘం వైస్ చైర్మన్ బి.వి.ఎస్.కృష్ణారెడ్డి, మృతుడి తల్లి సుగణమ్మ గురువారం మంగళగిరి రూరల్ పరిధిలోని ఆత్మకూరులో డీజీపీ హరీష్‌కుమార్ గుప్తాకు, విజయవాడ రైల్వే ఎస్పీ విజయ్‌రావుకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ విజయవాడలోని వెన్ సాయి పీవీసీ గ్రానైట్స్ కంపెనీలో మేనేజర్‌గా ప్రవీణ్‌కుమార్ పనిచేసేవాడని, 2025 మార్చి 12న కార్యాలయం నుంచి వెళ్లిన ప్రవీణ్ మార్చి 13న పల్నాడు జిల్లా నడికుడి రైల్వేస్టేషన్ పరిధిలోని తుమ్మలచెరువు ట్రాక్‌పై మృతదేహమై కనిపించాడని, మృతుడికి ఆత్మహత్య చేసుకోవాల్సిన సమస్యలు లేవని పేర్కొన్నారు. ప్రవీణ్ ఉద్యోగం చేసే ప్రాంతం, మృతి చెందిన ప్రాంతానికి సుమారు 138 కిలోమీటర్ల దూరం ఉందని తెలిపారు. తోటి కంపెనీ ఉద్యోగులను విచారణ చేస్తే అసలు విషయం బయటకు వస్తుందని, నడికుడి రైల్వే ఎస్ఐ విచారణ వేగవంతం చేయడం లేదని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు దీనిపై పూర్తి విచారణ చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ వినతిపత్రాలు అందజేశామని తెలిపారు.

కుమార్తె పెళ్లికి వెళ్లి వస్తుండగా రోడ్డు ప్రమాదం

- తల్లిదండ్రులకు తీవ్ర గాయాలు
- వధువు అన్నకు కూడా..
- చేబ్రోలులో అదుపుతప్పిన కారు



ముందు బాగం పూర్తిగా దెబ్బతిన్న కారు



108లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు



చేబ్రోలు: కుమార్తె పెళ్లికి వెళ్లి వస్తుండగా కారు ప్రమాదవశాత్తూ బ్రిడ్జి సైడ్‌వాల్‌ను వేగంగా ఢీ కొట్టడంతో తల్లిదండ్రులతోపాటు వధువు అన్నకు గాయాలైన ఘటన చేబ్రోలులో గురువారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. పొన్నూరు రూరల్ మండలం కట్టెంపూడి గ్రామానికి చెందిన రోహా, రాధిక దంపతులు తమ కుమార్తెను తాడికొండకు చెందిన అబ్బాయికి ఇచ్చి వివాహం చేశారు. వివాహం అనంతరం భార్యాభర్తలు, తమ కుమారుడు నవీన్ కుమార్‌రెడ్డితో కలిసి తాడికొండ నుంచి కారులో స్వగ్రామానికి గురువారం బయలుదేరారు. నవీన్‌కుమార్‌రెడ్డి కారు నడుపుతున్నాడు. చేబ్రోలులోని సినిమాహాలు సమీపంలో కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న వంతెన సైడ్ వాల్‌ను వేగంగా ఢీకొట్టింది. ఘటనలో కారు ముందు బాగం నుజ్జునుజ్జయింది. కారులో ఉన్న ముగ్గురికీ ముఖానికి, కాళ్లు, చేతులు, నడుంకు బలమైన గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే 108 వాహనం ద్వారా క్షతగాత్రులను గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక లారీ బీభత్సం

- ఆర్టీసీ బస్సును ఢీకొట్టి షాపుల్లోకి దూసుకెళ్లిన వైనం
- త్రుటిలో తప్పిన పెను ప్రమాదం



ఇసుక లారీ ఢీకొట్టడంతో వెనుకబాగం దెబ్బతిన్న ఆర్టీసీ బస్సు



షాపుల్లోకి దూసుకువెళ్లిన ఇసుక లారీ

చేబ్రోలు: ప్రమాదవశాత్తూ ఇసుక లారీ ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టి అదుపుతప్పి రోడ్డు పక్కనున్న షాపుల్లోకి దూసుకుపోయిన ఘటన చేబ్రోలు మండలం వేజండ్ల గ్రామంలో గురువారం జరిగింది. తెనాలి ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు గుంటూరుకు బయలుదేరి వేజండ్ల అడ్డరోడ్డు వద్ద ప్రయాణికులను ఎక్కించుకోవటం కోసం నిలిచి ఉంది. అదే సమయంలో తెనాలి నుంచి నారాకోడూరు వైపు వేగంగా వస్తున్న టర్బో ఇసుక లారీ ఆర్టీసీ బస్సును వెనుకవైపు ఢీకొట్టింది. వెంటనే అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలు, మెకానిక్ షాపులలోకి దూసుకువెళ్లింది. ప్రమాద సమయంలో షాపుల వద్ద ఎవరూ లేకపోవటంతో ప్రాణాపాయం తప్పింది. బస్సులోని ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. చేబ్రోలు పోలీసులు ఘటనా ప్రాంతానికి చేరుకొని ఇసుక లారీని, ఆర్టీసీ బస్సును పోలీసు స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

షూటింగ్ బాల్ జిల్లా జట్లు ఎంపిక

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సబ్ జూనియర్ బాల, బాలికల జిల్లా జట్ల ఎంపికలు సత్తెనపల్లి మండలం గుడిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం జరిగాయి. కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయుడు తోకసోమనాథ్ ప్రారంభించారు. ఎంపికకు బాలుర విభాగంలో 35, బాలికల విభాగంలో 30 మంది హాజరయ్యారు.

- బాలుర జట్టుకు ఎం.మణికంఠ, వి.వర్షిత్, ఎస్.భార్గవ్, జి.నాగ హనుమ, జి.వెంకటేష్, ఎస్. సుధీర్, జి.రంగా, బి గోపి, జి.సురేష్, ఎ.సూర్య, కె.శశి, శనగల భార్గవ్, స్టాండ్ బైలుగా కె. జోసఫ్, పి.ఆనంద్‌లు ఎంపికయ్యారు.
- బాలికల జట్టుకు పి.నందిని, ఎస్.సుస్మిత, ఎం.వీరలక్ష్మి, కె.ఉష, సీహెచ్ సంజన, ఎస్.సింధూర, పి.సులోచన రాణి, సి.చంద్రిక, కె.యశస్విని, ఎల్.మహాలక్ష్మి, కె.వేదవతి, ఎం. కీర్తన, స్టాండ్ బైలుగా ఎ.హేమ శివమణి, కె.వసంత కుమారి ఎంపికయ్యారు. ఈ క్రీడాకారులు ఈ నెల 25, 26వ తేదీలలో చిత్తూరు జిల్లా మదనపల్లిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని అసోసియేషన్ అధ్యక్షుడు మువ్వా నరసింహారావు, కార్యదర్శి కోనంకి కిరణ్ కుమార్ తెలిపారు.